ఎన్నికల హామీలు ఏమయ్యాయని
కాంగ్రెసోళ్లను నిలదీయండి

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర

అభివాదం చేస్తున్న నామా నాగేశ్వరరావు

చంద్రుగొండ, ఏప్రిల్ 15: ''అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఏవేవో హామీలతో ప్రజలను కాంగ్రెస్ నాయకులు మభ్యపుచ్చి మాయ చేశారు. గద్దెనెక్కిన తర్వాత, ఆ హామీల్లో ప్రధానమైన వాటిని గాలికి వదిలేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం వారు మళ్లీ జనం ముందుకు వస్తారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వాళ్లను ఎక్కడికక్కడ ప్రశ్నించండి, నిలదీయండి'' అని, బీఆర్ఎస్ శ్రేణులకు ఖమ్మం ఎంపీ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోవాలన్నారు. ఎన్నికల హామీల అమలులో జాప్యంపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని, ప్రజలు ప్రశ్నించేలా చూడాలని అన్నారు. ప్రశ్నించినప్పుడే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఓటర్ల దగ్గరకు వెళ్లి ఓట్లు అభ్యర్థించాలన్నారు. పార్లమెంటులో తెలంగాణ గళాన్ని వినిపించగలిగేది బీఆర్ఎస్ ఒక్కటేనని, అందుకే పార్టీ ఎంపీ అభ్యర్థి గెలవాలని చెప్పారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఎందుకు ఇవ్వలేదో బీజేపీ అభ్యర్థిని, నాయకులను నిలదీయాలని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలకు ప్రజలు మరోసారి మోసపోకుండా చూడాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. తండాలను, గూడేలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్‌ను నిలదీయాలని, ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం కొట్లాడే నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, నాయకులు దారా వెంకటేశ్వరరావు, బోయినపల్లి సుధాకర్‌రావు, సంగొండి రాఘవులు, కొత్తూరి వెంకటేశ్వరరావు, కమాల్, తాళ్లూరి జీవన్, భూక్యా ప్రసాద్, యూఎస్ ప్రకాశ్‌రావు, భారత లావణ్య, సూర వెంకటేశ్వరరావు, మేడా మోహన్‌రావు, భూపతి రమేష్, నల్లమోతు వెంకటనారాయణ, చీదెళ్ల పవన్‌కుమార్, గాదె లింగయ్య, మామిల్లపల్లి లక్ష్మణ్‌రావు, లంకా విజయలక్ష్మి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రారంభం..

- భద్రాచలం వద్ద రెండో వంతెన నిర్మాణానికి పదేళ్ల పాటు సాగిన పనులు
- రాములోరి కల్యాణం కోసం రాకపోకలను అనుమతించిన అధికారులు
- ఎన్నికల నియమావళి ముగిశాక అధికారిక ప్రారంభానికి ఆలోచనలు

భద్రాచలం : రెండో వారథిని గుమ్మడికాయ కొట్టి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక అల

భద్రాచలం, ఏప్రిల్ 15: దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం వద్ద పదేళ్ల క్రితం ప్రారంభమైన రెండో వారథి నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తి కావడంతో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక సోమవారం దానిని లాంఛనంగా ప్రారంభించారు. కేవలం ఈ శ్రీరామనవమి నాటికి ఈ వంతెనను పూర్తి చేయాలన్న ఆలోచనతోనే పనులను వేగంగా పూర్తిచేసి ముగించారు.

సుమారు పదేళ్లు..

గోదావరి నదిపై సారపాక-భద్రాచలాన్ని కలుపుతూ నిర్మిస్తున్న ఈ రెండో వంతెన నిర్మాణ పనులను 2015 ఏప్రిల్ 1 అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఐఏ) పర్యవేక్షిస్తున్న ఈ నిర్మాణాన్ని రాజ్‌దీప్ అనే నిర్మాణ సంస్థ రూ.65 కోట్ల కాంట్రాక్టుకు చేపట్టింది. 1.20 కిలోమీటర్ల మేరకు 37 పిల్లర్లతో ఈ నిర్మాణం జరగాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగా మొదట్లోనే దీని నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. తరువాత డిజైన్ లోపం, పిల్లర్లలో నాణ్యతా లోపం, కూలీలకు సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడం, కరోనా సమయంలో కూలీలు దొరకకపోవడం వంటి అనేక కారణాలు ఇందుకు తోడయ్యాయి. ఈ నిర్మాణం ఆలస్యమవుతున్న విషయం గురించి, త్వరగా నిర్మించాల్సిన ఆవశ్యకత గురించి మహబూబాబాద్ ఎంపీ మలోత్ కవిత ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎన్నోసార్లు వివరించినా స్పందన లేకపోయింది.

మొదటి వంతెన ఆరేళ్లలోనే..

1956కు ముందు భద్రాచలం రావాలన్నా, ఇక్కడి నుంచి బాహ్య ప్రపంచానికి పడవలే శరణ్యమయ్యేవి. 1956లో జరిగిన ఓ పడవ ప్రమాదంలో సుమారు 200 మంది ప్రయాణికులు జలసమాధి అయ్యారు. దీంతో అప్పటి ప్రభుత్వం భద్రాచలం వద్ద వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 1959 డిసెంబర్ 16న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి దీనికి శంకుస్థాపన చేయగా.. 1965లో నిర్మాణం పూర్తయింది. అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అప్పుడే దీనిని ప్రారంభించారు. సాంకేతికత అంతగా లేని ఆ కాలంలోనే బ్రిడ్జి నిర్మాణానికి ఆరేళ్ల సమయం పట్టింది. ప్రస్తుతం ఉన్న ఆధునిక సాంకేతికతతో మూడేళ్లలోపే పూర్తి కావాల్సిన ఈ బ్రిడ్జి నిర్మాణం పదేళ్ల పాటు సాగింది.

ఒక్క వంతెనతో ఇబ్బందులున్నందునే..

1956లో నిర్మాణం ప్రారంభించిన ఈ వంతెన ఇప్పటి ట్రాఫిక్‌కు పెద్దగా సరిపోవడం లేదు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపేలా ఉన్న ఈ వంతెనపై వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ముఖ్యంగా భద్రాచలంలో జరిగే నవమి, ముక్కోటి వంటి ఉత్సవాల సమయంలో ఈ బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వందల సంఖ్యలోని వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. దీంతో రెండో బ్రిడ్జి నిర్మాణం అనివార్యమైంది. దీంతో కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలవగా.. రాజ్‌దీప్ అనే నిర్మాణ సంస్థ రూ.65 కోట్లకు కాంట్రాక్టు దక్కించుకుంది. మొదట్లోనే పిల్లర్ల నిర్మాణంలో నాణ్యతా ప్రామాణాలు పాటించని కారణంగా ఎన్‌హెచ్ ఐఏ అధికారులు కొన్ని పిల్లర్లను కూల్చివేయించారు. తరువాత సంస్థకు రెండుసార్లు జరిమానాలు కూడా విధించారు. ఇలాంటి అనేక అవాంతరాల మధ్య ఈ బ్రిడ్జి నిర్మాణం సుమారు పదేళ్లపాటు సాగింది.

'నవమి' రాకపోకలకు అనుమతి..

అయితే ఇటీవల ఈ బ్రిడ్జి పనుల పురోగతిని పరిశీలించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీరామనవమి నాటికి ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, రాములోరి కల్యాణానికి వచ్చే భక్తులకు అందుబాటులోకి తేవాలని, వాహనాల రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని కాంట్రాక్టు సంస్థను, అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ సహా సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఈ పనులను పూర్తి చేయించారు. ఎట్టకేలకు నవమి కోసం ఈ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను అధికారులు అనుమతించారు. లోక్ సభ ఎన్నికల నియమావళి ముగిసిన అనంతరం అధికారికంగా ప్రారంభించేలా సమాలోచనలు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య ఉండదు.. : కలెక్టర్

భద్రాచలం, ఏప్రిల్ 15 : భద్రాచలం-సారపాకను కలుపుతూ నిర్మించిన రెండో వారధిని ప్రారంభించడంతో ట్రాఫిక్ కష్టాలు తీరినట్లైందని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. గోదావరి నదిపై రూ.98.45 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండో వంతెనను సోమవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 7.5 మీటర్ల వెడల్పుతో మొత్తం 37 పిల్లర్లతో బ్రిడ్జిని నిర్మించామన్నారు. రెండో వారధి శ్రీరామనవమి నాటికి అందుబాటులోకి రావడంతో రవాణా సులభతరం అవుతుందన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, డీఈ శైలజ, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గరుడ ధ్వజారోహణం

గరుడ ప్రసాదం పంపిణీ చేస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 15: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు సోమవారం గరుడ ధ్వజారోహణం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రాకార మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. గరుత్మంతుని పటాన్ని ధ్వజ స్థంభంపై ఎగురవేశారు. భేరీ తాండనం నిర్వహించారు. సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రామయ్యకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు స్థావరాలపై భద్రతా దళాల దాడి

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 15 : మావోయిస్టుల ఆపరేషన్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని అడవుల్లో భద్రతా దళాలు మావోయిస్టుల స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించాయి. బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మిలీషియా ప్లాటూన్ కమాండర్ సోమ్లు, జనతన్ సర్కార్ ప్రెసిడెంట్ రాంధర్ బెక్కో మరికొందరు మావోయిస్టులతో సాయుధులుగా ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో కేశ్‌కుతుల్ క్యాంప్ నుంచి సీఆర్‌పీఎఫ్ 199/సీ భద్రతా దళాలు ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. జవాన్ల రాకను ముందే గుర్తించిన మావోయిస్టులు ఆ ప్రాంతం నుంచి దట్టమైన అటవీ మార్గంలోని పర్వతాల మీదుగా పారిపోయారు. ఈ క్రమంలో మావోయిస్టులు వదిలి వెళ్లిన పేలుడు పదార్థాలు, ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.

సుక్మా జిల్లాలో ఏడుగురు మావోయిస్టులు అరెస్ట్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టగా.. గమనించిన మావోయిస్టులు పారిపోయేందుకు యత్నించగా ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ సోమవారం వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో మాద్వి దేవా అలియస్ దినేశ్, బంజం పొజ్జా, కవాసి అలియాస్ వాండో అయిత, కల్ము గంగ, కల్ము సన్నా, నుప్పో పొజ్జా, రవాలుగా పోలీసులు గుర్తించారు. కవాసి టేటెంగూడా రివల్యూషనరీ పీపుల్స్ కౌన్సిల్(ఆర్పీసీ) ఆధ్వర్యంలో దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్(డీఏకేఎంఎస్) అధ్యక్షుడిగా ఉన్నాడని, ఇతడిపై రూ.లక్ష రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 3 కేజీల బ్లాక్ పౌడర్, 8 కేజీల ఐఈడీ, 3 కేజీల బరువున్న టిఫిన్ బాంబు, రెండు జిలిటిన్ స్టిక్స్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దంతేవాడ జిల్లాలో 26 మంది లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిర్వహిస్తున్న 'లోన్ వర్రాటు' కార్యక్రమంలో భాగంగా సుక్మా జిల్లాలో ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట సోమవారం 26 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న లోన్ వర్రాటు(ఇంటికి తిరిగి రావాలి) అనే కార్యక్రమంతో ఏజెన్సీ ప్రాంతవాసుల్లో మార్పు తీసుకొస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఛత్తీసగఢ్‌లో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఇటీవల కాలంలో భీకర పోరు సాగుతోంది. మరోవైపు లోన్ వర్రాటుకి ఆకర్షితులైన మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు, దళ సభ్యులు, నాయకులు ఇటీవల కాలంలో నిత్యం లొంగు'బాట' పడుతున్నారు. ఇందులో భాగంగానే 26 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు ఎస్పీ గౌరవ్ రాయ్ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసింది గా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్టీసీ ఉద్యోగుల వైద్యశిబిరం

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 15 : శ్రీరామనవమి సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల కోసం భద్రాచలం బస్టాండ్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఏవీ గిరిసింహారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. నవమి, పట్టాభిషేకం ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్నందున మండు వేసవిని పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచామని వివరించారు.

నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ కార్యవర్గం

జడ్జిని కలిసి పరిచయం చేసుకుంటున్న బార్ సభ్యులు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 15 : కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గం తెలంగాణ హైకోర్టు జస్టిస్ శ్రావణ్‌కుమార్, జిల్లా పోర్టు పోలియో జడ్జిని మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగూడెం కోర్టులో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, రవిచంద్ర, మహ్మద్ సాధిక్‌పాషా, కరుణాకర్, ప్రవీణ రవికుమార్, మారపాక రమేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రులు

పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచ, ఏప్రిల్ 15 : మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఏడురోజులుగా దేవీ వసంత నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పాదనీరాజనం, శ్రీచక్రార్చన, సూర్య నమస్కారాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీసూక్త పారాయణ, చండీ సప్తశతి పారాయణం, హోమాలు, జపములు నిర్వహించారు. మధ్యాహ్నం లక్ష కుసుమార్చన చేశారు. ఈవో సుదర్శన్, అర్చకులు, రుత్వికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో పనులు ప్రారంభించాలి

దమ్మపేట, ఏప్రిల్ 15: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని ప్రత్యేకాధికారి/నీటి పారుదల శాఖ ఈఈ సురేష్ కుమార్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్ఎంలు, వీఓలతో సమావేశమయ్యారు. మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఎంపీడీవో రవీంద్రరెడ్డి, ఎంఈవో లక్ష్మి పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి రాకుండా చూడాలి

మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

చంద్రుగొండ, ఏప్రిల్ 15: ఈ వేసవిలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా చూడాలని అధికారులను ఎంపీపీ బానోత్ పార్వతి కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. పార్వతి మాట్లాడుతూ.. గ్రామాల్లోని తాగునీటి బోర్ల మరమ్మతులు పూర్తయినట్లు చెప్పారు. మండలంలోని 48 ట్యాంకులు, 7,600 నల్లాలు ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో అశోక్, ఎంపీటీసీ సభ్యులు, ప్రధాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుభాని కార్టూన్‌కు బహుమతి

ప్రత్యేక బహుమతిని అందుకుంటున్న సుభాని

పాల్వంచ, ఏప్రిల్ 15 : విజయవాడలోని బుక్ ఫెస్టివల్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాల్వంచకు చెందిన కార్టూనిస్టు ప్రత్యేక జ్యూరీ బహుమతి అందుకున్నారు. ఉగాది సందర్భంగా విశాఖకు చెందిన విశాఖ కార్టూనిస్టు ఫోరం పోటీ నిర్వహించింది. ఆంధ్రా, తెలంగాణ నుంచి దాదాపు 70మంది కార్టూనిస్టులు పాల్గొన్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్ గురించి సుభాని గీసిన కార్టూన్ పలువురిని ఆకట్టుకుంది.

అన్నదానానికి విరాళం

భద్రాచలం, ఏప్రిల్ 15: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పట్టణంలోని మెడిలైఫ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సీతారామరాజు-కృష్ణవేణి దంపతులు సోమవారం రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. వారిని అధికారులు సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

రాష్ట్ర సరిహద్దులో ఎక్సైజ్ దాడులు

దాడుల్లో పాల్గొన్న ఉమ్మడి అధికారులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 15: ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోని ఎక్సైజ్ అధికారులు ఉమ్మడిగా సోమవారం సరిహద్దు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం అంకంపాలెం గ్రామంలో 50 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోయించారు. ముందుగా, అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ మాట్లాడుతూ.. ఏపీ నుంచి మద్యం, నాటు సారా, గంజాయి వంటి మత్తు పదార్థాల దిగుమతి కాకుండా కట్టుదిట్ట చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇందులో సరిహద్దు చెక్‌పోస్ట్‌లను బలోపేతం చేశామని, పటిష్ట నిఘా ఉంచామని అన్నారు. అశ్వారావుపేట ఎక్సైజ్ ఎస్ఈబీ సాంబమూర్తి, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ పట్టాబి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ ఫెడ్ అక్రమాలపై విచారణకు వినతి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 15: ఆయిల్‌పాం హబ్‌గా పేరొందిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్ ఫెడ్ అక్రమాలపై విచారణ జరపాలని, అర్హులైన రైతులకు ప్రభుత్వ రాయితీలు అందేలా చూడాలని కోరుతూ తెలంగాణ ఆయిల్‌పాం అశ్వారావుపేట జోన్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మూరు మహేశ్వర్‌రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య సోమవారం డీహెచ్ఎస్‌వో సూర్యనారాయణకు కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. ఆయిల్ ఫెడ్ అధికారుల అవగాహన లేమి కారణంగా ఆయిల్‌పాం రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యలను పరిష్కరిస్తానని డీహెచ్ఎస్‌వో హామీ ఇచ్చారు.

నేడు ఆయిల్ ఫెడ్ ఎండీ పర్యటన

అశ్వారావుపేట, ఏప్రిల్ 15: ఆయిల్ ఫెడ్ ఎండీ అశోక్‌రెడ్డి మంగళవారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటిస్తారు. పామాయిల్ ఫ్యాక్టరీలు, తోటలు, ఆయిల్‌పాం నర్సరీలను సందర్శిస్తారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేట, ఏప్రిల్ 15: ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని వినాయకపురం గ్రామస్తుడు మారేశ్వరరావు.. నారాయణపురం సమీపంలోని వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్నాడన్న సమాచారంతో ఎస్సై శ్రీరాముల శ్రీను సోమవారం తనిఖీ చేవారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పాము కాటుతో మహిళ మృతి

దమ్మపేట, ఏప్రిల్ 15: పాము కాటుతో మహిళ మృతిచెందింది. ఆమె కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని మొద్దులగూడెం గ్రామస్తురాలు నారం జమున(50) ఆదివారం మక్క చేనులో కంకులు విరుస్తుండగా పాము కాటేసింది. ఆమెను కుటుంబీకులు, బంధువులు వెంటనే సత్తుపల్లి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఖమ్మంలోని వైద్యులు పరీక్షించి, ఆమె అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు సందర్శించి నివాళర్పించారు. ఆమె భర్త సుబ్బారావుకు సానుభూతి తెలిపారు.

వ్యక్తికి జైలు శిక్ష

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 15 : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండురోజుల జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకెళ్తే.. పాల్వంచరూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తన సిబ్బందితో జగన్నాథపురం సెంటర్‌లో గత నెల 22వ తేదీన వాహన తనిఖీ చేస్తుండగా బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన ఆరెం వెంకటేశ్వర్లు మద్యం తాగి ట్రాక్టర్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డాడు.

నవమికి ముస్తాబవుతున్న మంటపాలు

రామవరం, ఏప్రిల్ 15 : శ్రీరామనవమిని పురస్కరించుకొని సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ శ్రీ సీతారామచంద్ర దేవస్థానం ఆధ్వర్యంలో శాశ్వత మంటపం ఏర్పాటు చేస్తున్నారు. రామయ్య కల్యాణాన్ని తిలకించేందుకు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, ప్రభావిత ప్రాంతాల ప్రజలు అధికసంఖ్యలో రానున్న నేపథ్యంలో సింగరేణి సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 15: పట్టణంలోని సుందరయ్య నగర్ ఫీడర్‌లో ట్రాన్స్‌పార్మర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత వంటి పనులను మంగళవారం చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా, ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. బండారుగూడెం మెయిన్ రోడ్డు సబ్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు, సుందరయ్య నగర్, లెనిన్ నగర్, భగత్‌సింగ్ నగర్, వినాయక నగర్, కుంకుడుచెట్ల గుంపు, గాంధీనగర్, శ్రీశ్రీ నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంటి వైద్య శిబిరం

గుండాల, ఏప్రిల్ 15: వాసవీ క్లబ్ గ్రీన్ ఫీల్డ్ గుండాల, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్తంగా సోమవారం గుండాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించాయి. దీనిని క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. 400 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 150 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పారు. నిర్వాహక బాధ్యులు మానాల వెంకటేశ్వర్లు, పుల్లఖండం ఉపేందర్ రావు, అనుముల వెంకటేశ్వర్ రావు, గౌరిశెట్టి శ్రీనివాస్, ఖాదర్ బాబా, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కూల